

# బలిదానం

★

....ఆమె జీవనజ్యోతి అర్పగా
పిశాచాలలో లీనమైపోయి
దాటారు ఆ పురి
ప్రజలు.

★

: కథానిక :
శ్రీమతి దాసరి కమలాదేవి

: చిత్రం :
శ్రీమతి వి సరోజిని

పొలంలో తాత తన ఎద్దును మేపుకుంటున్నాడు. ఇంటిలో సహాయ మెవ్వరూలేరు. భుజంమీద కొంగు క్రింద పరచి మేను వాల్చాడు. పడుకొని కండ్ల నీరు కార్చాడు. పాపం వృద్ధునికి మనస్సులో ఏమి బాధో! ఇంతలో నలు దెసల సంజకెంజాయలు అలముకొన్నాయి. తన ఎద్దును తోలుకొని సమీపాన్నున్న చిన్న గ్రామానికి బయలు దేరేడు.

అది పర్వత ప్రాంతపు పల్లె కాబట్టి మంచి ఇల్లు ఒక్కటీ లేదు. అన్నీ మట్టిండ్లే. ఆ ఇండ్లలో వృద్ధుని దొకటి. ముగు సలి ఉస్సురుస్సురనుకొంటూవచ్చి ఎద్దును కట్టు కొయ్యకు కట్టి అలసటతో "గౌరీ! గౌరీ! తలుపు తీయమ్మా" అని పిలచేడు. దొడ్లో పొయ్యి రాజేయ పోతున్న గౌరి, తాత గొంతు విని నిప్పు అక్కడే వదిలి పెట్టి పరుగు పరుగున వచ్చి తాతకు తలుపు తీసింది. తాత త్వరగా లోపలికి వచ్చి కుక్కి నులక మంచముమీద కూలబడ్డాడు. ఇంతలో గౌరి పొయ్యి రాజేసి తాత కొరకు నీరు కాగబెట్టి వచ్చి "తాతా నీళ్లు తోడినాను, స్నానానికిరా!" అని అన్నది.

అని గౌరి తాతను స్నానము చేయించి అన్నము పెట్టింది. తాత మనమరాలి చేతి బువ్వను ఆనందముతో ఆరగించి ఆ రాత్రి నిదురపోయాడు. ఈ తాతకు లేకలేక ఒక్క కూతురు పుట్టింది. ఆమె పెద్దదైన తరువాత పెండ్లి చేసేడు. కూతురి పెండ్లప్పటికే అతని భార్య చనిపోయింది. కూతురువద్దనె

ఈ తాత తన కాలము గడిపి దాని సేతమీదుగా దాటి పోదలచేడు. కాని తానొకటి తలచిన దైవమొకటి తలచె నన్నట్లు తన కూతురు ఈ గౌరిని భూమి మీదవదలి తన దారిని తాను పోయింది. కాలుడు ఆమెను మ్రింగి వేసేడు. అనాటి నుండి తాత మనుమరాలిని పెంచి పెద్దదానిని చేసాడు.

ప్రక్కనున్న పట్టణంనుండి ఒక ధనికుడు ఆ గ్రామానికి వచ్చి చేరేడు. అతని పేరు ఆనందరావు. పాతిక సంవత్సరాలుంటాయి. పట్టి త్రాగుబోతు.

తాతకు ఒక దినము దగ్గు, పడిసెము పట్టింది. అందువలన గౌరి ఎద్దుకు గడ్డి కోసుకు రావటానికి వెళ్లింది. చెలువు గట్టున గడ్డి కోస్తుండగా ఆనందరావు ఆమెను చూచి తాను వివాహమాడాలనుకున్నాడు. మరుచటి దినం తాతవద్దకు పోయి గౌరిని తన కిమ్మని అడిగేడు. కాని గౌరిని ఇచ్చుటకు తాత ఒప్పుకోలేదు. ధన ముండేనేమి? నీవు గుణహీనుడవు. నా గౌరి సుగుణవతి. ఆమె సుఖమే ప్రధానము గాని నాకు డబ్బుతో పనిలేదు. నీకు నా గౌరినియ్యనన్నాడు.

కొంత కాలం గడిచింది. ఆ సంవత్సరము ఆ చుట్టుపట్ల ఎచ్చటా ఒక్క చినుకైనా పడలేదు. తాతకు ఆరోగ్యము అంత బాగుండుటలేదు. వర్షాలు లేక పోవటంవల్ల ఎద్దుకు గడ్డి లేదు. వెళ్లి కోసుకురావటానికి తాతకు శక్తి లేదు. పోనీ గౌరిని ఒక్కదానిని పంపుదామంటే దుర్మార్గుడు ఆనందరావు గౌరిపై కన్ను వేశాడు. అందువల్ల ప్రతి దినము అన్నము తిన్న తరువాత గౌరి గడ్డికి పోతుంటే గౌరితో ఆమెకు తోడుగా తాతకూడ కర్ర పట్టుకొని పోయేవాడు.

ఈ సమయంలో ఆ ఊరి అమాయక ప్రజలందరు ఆనందరావును పెద్దగా చేసి అతని వద్దకు పోయి క్షామనివారణార్థం ఏమి చేయవలెనని అడిగేరు. ఆనందరావు వారితో "గంగానమ్మకు కోపము వచ్చినది. ఆమె కోపమును పోగొట్టుటకొరకు జాతర చేసి బలి ఇయ్యవలె"నని సలహా ఇచ్చేడు. వారు "ఏ బలి?" అని అడిగేరు. "మంచి బలముగల చక్కని వృషభమును బలి ఇయ్యవలె"నని చెప్పేడు. మంచి వృషభము ఎవరివద్దను లేదు, తాతవద్ద తప్ప. తాతను ఎద్దు నమ్మమని అడగమని ఆనందరావు వాళ్లతో చెప్పేడు. ఊరిలో కొందరు పోయి తాతను ఎద్దు నమ్మమని అడిగేరు. తాతకి జీవితంలో రెండే మిగిలాయి- తన గౌరీని, తన ఎద్దూను. ఎద్దును బలికి తోలేస్తే తన గౌరినీ తన సర్వస్వమునూ పోగొట్టుకున్నట్టే అనుకున్నాడు. అమ్మవారికి అంతగా బలి కావలసి వస్తే నన్నే చంపయ్యండి, ఎద్దు రక్తంకన్నా మానవ రక్తం రుచికరంగా వుంటుంది అన్నాడు.

ఆనందరావు ఒకనాటి సాయంకాలము తాత బీటిలో గడ్డి కోయటానికి పోయినప్పుడు ఎద్దును ఊడదీసుకొచ్చి పసుపురాసి కుంకుముంచి మాలలతో నలంకరించి బలికి తయారు చేసేరు. పాపము నోరు లేని జంతువు ఏమి చేయగలదు. తన్ను అత్యంత ప్రేమతో చూచెడి తాత కొరకు అటుఇటు చూచుచు అరవ నారంభించింది. ఆ దీనాలాపం తాతకి వినిపించింది. తాత నెత్తీ నోరూ కొట్టుకొంటూ గంగమ్మ గుడి వద్దకు పరుగెత్తుకు వచ్చాడు. ఎద్దును గంగమ్మ ముందు నిలబెట్టి ప్రదక్షిణాలు చేసి కత్తిని గురి చూచి ఎత్తేరు. దానిని చూచి తాత పరుగుపరుగున వచ్చి అచ్చట చేరేడు. ఎత్తిన కత్తి క్రింద పడింది. రక్తము వరదలై ప్రవహించింది. ఎద్దు చెక్కు చెదరలేదు. కాని, క్రింద తాత రెండు తునకలై పడ్డాడు. వెంటనే పెద్ద వర్షము వచ్చింది. ఆ వర్షధారలలో ఎద్దు కంటి ధారలు లీనమై పోయాయి. ఎద్దు మాత్రం తాత మొండెంవద్దే నిలబడి పోయింది. బెదిరించినా, కొట్టినా కదల లేదు. తాత పెంచిన ఎద్దు, మూర్ఖ ప్రజ కడుపున పెట్టుకొన్న ఎద్దు, శిలయై నేటికీ ఆ గ్రామంలో నందీశ్వరుడులా వెలిసివున్నాడు. తాతా, ఎద్దూ ప్రపంచంలో లేరు. గౌరికూడా అదృశ్యమై పోయింది. ఆమె జీవన జ్యోతి అమ్మవారి విగ్రహంలో లీనమైపోయిందంటారు ఆ వూరి ప్రజలు.

—అందుకే ఆ గ్రామంలో ఆ నాటినుంచీ గ్రామ దేవతకు బలి మానుకున్నారు.

★